క్లుప్తంగా

ఘనంగా సామూహిక సీమంతాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండలంలోని ముద్దలాపురం ఈశ్వరమ్మ దేవాలయంలో శుక్రవారం హరిగిరి నారాయణస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి గర్భిణులకు పండ్లు, చీర, జాకెట్, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకుని పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, సర్పంచ్ ధనుంజయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, దేవేంద్ర, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

రాయదుర్గం: నియోజకవర్గంలోని డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, కణేకల్లు, బొమ్మనహాళ్, రాయదుర్గం మండలాల్లో దెబ్బతిన్న 11 గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా రోడ్ల బాగుకోసం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఇటీవల ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి నివేదికలను సిద్ధం చేయించారు. వాటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, రోడ్ల దుస్థితిపై వివరించారు. విప్ విజ్ఞప్తి మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 11 రోడ్లకు పీఆర్ఆర్ స్కీమ్ ద్వారా రూ. 21.60 కోట్ల నిధులను శుక్రవారం మంజూరు చేస్తూ జీఓ 59 విడుదల చేశారు. దీంతో ఐదు మండలాల్లోని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. విప్‌తో పాటు సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కుందుర్పి: పౌష్టికాహారంతో గర్భిణుల్లో ఆరోగ్య పరిపుష్టి సాధ్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి అనూష సూచించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 42 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు నెలకు రెండుసార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

ఈ-క్రాప్ తప్పనిసరి

కుందుర్పి: రబీలో పంటలు సాగుచేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని అప్పిలేపల్లి, కుందుర్పి తదితర గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బందితో కలసి ఈ-క్రాప్ నమోదు చేయించారు. మండలంలోని 16 ఆర్‌బీకేల పరిధిలో 2,319 ఎకరాల్లో వివిధ రకాల పంటలు రైతులు సాగు చేసినట్లు ఏఓ తెలిపారు. నెల రోజులుగా 2,290 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశామని, మిగిలిన రైతులు ఈనెల 20లోగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు.

ఈఈ దురుసుగా మాట్లాడారని ధర్నా

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక విద్యుత్ ఈఈ శేషాద్రిశేఖర్ యూనియన్ నాయకుడిని దురుసుగా మాట్లాడారని సీపీఐ, ఏఐటీయూసీ, ఎలక్ట్రికల్ సిబ్బంది, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈఈ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ సిబ్బంది, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఇబ్రహీమ్ సమస్యల పరిష్కారం కోసం ఈఈని కలిసి విన్నవించేందుకు వెళ్లగా ఈఈ ఇష్టానుసారంగా మాట్లాడడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జెన్‌కో అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, వెంకటేశులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ ,పట్టణ కార్యదర్శి ఓంకార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు హనుమంతరాయుడు, తిలక్ తదితరులు ధర్నా చేపట్టారు. పట్టణ సీఐ తేజామూర్తి సంఘటన స్థలానికి చేరుకుని ధర్నా విరమింపచేయించారు.

పాఠశాలకు టీవీ వితరణ

బొమ్మనహాళ్: మండలంలోని బందూరు ప్రాథమిక పాఠశాలకు రూ.15 వేల టీవీని దేవగిరి సర్పంచ్ రాధిక అందజేశారు. ఆమె మాట్లాడుతూ కుమార్తె పవిత్ర జన్మదినం సందర్భంగా టీవీ అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కుందుర్పి: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జిల్లా కేంద్రంలోని శాంతిరాం ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మి, లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి తెలిపారు. శిబిరానికి వచ్చే రోగులు రేషన్ కార్డు, ఆధార్, రెండు పాస్ ఫొటోలు తీసుకురావాలని వారు సూచించారు.

టీడీపీలో స్థానిక చిచ్చు..!

- టికెట్ కోసం 'చినబాబు'తో మొదలైన పైరవీలు
- కాలవను ఎంపీ అభ్యర్థిగా పంపుతారంటూ ప్రచారం
- నేతల మధ్య మొదలైన పోటీ

రాయదుర్గం: సాధారణ ఎన్నికలకు ఇంకా 14 నెలల గడువున్నా 'రాయదుర్గం' టీడీపీలో అప్పుడే నేతల మధ్య పీటముడి మొదలైంది. పార్టీ క్యాడర్‌ను కాపాడేది స్థానికులైతే.. పదవులు మాత్రం స్థానికేతరులకు కట్టబెట్టడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా టిక్కెట్ ఆశిస్తూ.. వలస నేతల కారణంగా ఇన్నాళ్లు భంగపాటుకు గురవుతున్న ముఖ్య నేతలంతా 'చినబాబు' తో పైరవీలు సాగిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. స్థానికులకు టికెట్ ఇస్తేనే పార్టీ విజయానికి కృషి చేస్తాం.. లేకపోతే దూరంగా ఉంటామంటూ బాహాటంగా చెప్పుకునే స్థితికి చేరింది. ఎప్పటి నుంచో నివురుగప్పిన నిప్పులా ఉన్నా ఈ వ్యవహారం ఒక్కసారిగా తెరమీదికి రావడంతో వలస నేతలకూ తలపోటుగా మారనుంది. ఇదిలా ఉండగా.. నేతల మధ్య అంతర్గత పోరు ముదిరిపోవడం, అధికారంలో ఉన్నన్నాళ్లు కీలక పదవులు అనుభవించిన వారంతా దూరం కావడం, నీరు–చెట్టు, కాంట్రాక్ట్ పనుల ద్వారా నాలుగు రాళ్లు వెనకేసుకున్న వారు సైతం చుట్టపుచూపుగా వచ్చిపోతుండడం లాంటి కారణాలు వెరసి వచ్చే ఎన్నికల్లో పార్టీని గట్టెక్కించడం సాధ్యమేనా..? అంటూ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న కొందరు శ్రేణులు అంతర్మథనంతో కుంగిపోతున్నారు. కాలవ శ్రీనివాసులు అభ్యర్థిత్వంపై కూడా సొంత సామాజిక వర్గంతో పాటు బలమైన కురుబ, గొల్ల, దళిత, నేసే, మైనార్టీ, ఇతరత్ర వర్గాల్లో అసంతృప్తి రగులుతున్నట్టు తెలుస్తోంది. పార్టీ నిర్వహించిన పలు సర్వేల్లోనూ ప్రతికూల పరిస్థితులే కనిపిస్తుండడంతో అభ్యర్థి మార్పుపై కూడా తర్జనభర్జన జరుగుతోందన్న ప్రచారం ఊపందుకుంది.

కాలవను ఎంపీ అభ్యర్థిగా పంపుతారా..?

మాజీ మంత్రి కాలవను ఇతర నియోజకవర్గం లేదా ఎంపీ అభ్యర్థిగా పంపే అవకాశం ఉందనే ప్రచారం జోరందుకుంది. చినబాబు పాదయాత్ర షెడ్యూల్‌లో కీలకంగా వ్యవహరించే ఓ ప్రజాప్రతినిధి టిక్కెట్టు తనకే వస్తుందంటూ ఇప్పటికే క్యాడర్‌తో చర్చలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే ఓ బలమైన సామాజిక వర్గంలో సేవ కార్యాక్రమాలు చేస్తున్న మరో వ్యక్తి తో పాటు అదే సామాజిక వర్గానికి చెందిన ఓ ముఖ్య నాయకుడు జిల్లా స్థాయిలో కీలక పదవి అనుభవించి టికెట్ కోసం పోరాటం సాగిస్తున్నట్టు తెలుస్తోంది. స్థానిక వాదన వీరికి కలిసొచ్చే అవకాశం ఉందని చెప్పుకుంటున్నారు.

ముదురుతున్న వివాదాలు..

నేతల మధ్య వివాదాలు కూడా చాపకింద నీరులా ముదురుతున్నాయి. తెరపైకి అంతా బాగున్నట్టు కనిపిస్తున్నా లోలోపల పాము– ముంగీసను తలపిస్తోంది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. నూతన సంవత్సర వేడుకల సందర్భాన ఇద్దరు ముఖ్యనాయకులు విడిగా సమావేశాలు నిర్వహించి కేక్ కట్ చేశారు. అలాగే పార్టీ లోని ఓ యువ నాయకుడు ముఖ్య నాయకుడి వ్యవహార శైలి నచ్చక దూరమయ్యారు. ఇటీవల అతడి జన్మదిన వేడుకల సందర్భంగా యువత బైక్ ర్యాలీ చేపట్టి మద్దతుగా నిలవడం చర్చకు దారితీసింది. దీనికి తోడు కణేకల్లు మండలంలోనూ నేతల మధ్య అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. డి హీరేహాళ్ మండలంలోనూ ఓ నాయకుడి గుప్పెట్లోనే పార్టీ ఉండడంతో అసంతృప్తి తారస్థాయికి చేరింది. రాయదుర్గం, గుమ్మఘట్ట లోనూ కొన్ని కారణాలతో నేతల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే టీడీపీని కొందరు వీడి వైఎస్సార్‌సీపీ లో చేరగా, మరింత మంది అదే బాటలో ఉన్నట్టు తెలుస్తోంది.



అధికార పార్టీ ప్రభంజనం తట్టుకునేదెలా..?

పేదలందరికీ పారదర్శకమైన సేవలందిస్తూ నవరత్న పథకాల ద్వారా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను సమకూర్చుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని తట్టుకుని నిలిచేదోలా అంటూ టీడీపీ శ్రేణుల్లో ఆందోళన కనిపిస్తోంది. గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, మున్సిపాలిటీ ఇలా ఎన్నిక ఏదైనా సరే ఇప్పటివరకూ వార్ వన్ సైడ్‌గా ఉండిపోయింది. ప్రజలంతా జగన్ కే జైకొట్టి మద్దతుగా నిలిచారు. సంక్షేమ ప్రధాతగా చెప్పుకునే జగన్‌ను దూరం చేసుకునేందుకు ప్రజలు ఇష్టపడని పరస్థితి. ఈ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు వారిని ఎలా నమ్మిస్తారో అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘాటుగా విమర్శలు సందిస్తున్నారు. 'దుర్గం'లో ఎన్నికల వాతావరణం ఇరు పార్టీల్లోనూ మొదలైనట్టు కనిపిస్తోందని చెప్పవచ్చు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: 'విద్యుత్ సరఫరా చేయండి' అనే శీర్షికనతో సాక్షి దిన పత్రికలో శుక్రవారం వచ్చిన కథనానికి ట్రాన్స్ కో అధికారులు స్పందించారు. మండలంలోని మరుట్ల విద్యుత్ ఉప కేంద్రంలో తలెత్తిన సమస్యను ట్రాన్స్‌కో ఏఈ గౌస్ సిబ్బందితో కలసి పరిష్కరించారు. దీంతో మరుట్ల–1, 2, 3 కాలనీలు, ఉదిరిపికొండ తండా గ్రామాలకు విద్యుత్ సరఫరా అయింది. ఐదు రోజులుగా నెలకొన్న విద్యుత్ సమస్య తీరడంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

శుభకార్యం

బొమ్మనహాళ్: మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకల్లో ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం మండలంలోని దర్గాహొన్నూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు నుంకేష్ వివాహ వేడుకల్లో ప్రభుత్వ విప్‌తో పాటు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మరో రెండు వివాహ కార్యక్రమాలకు వారు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని కొర్రకోడు సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ సోదరుడు గిరిప్రసాద్ యాదవ్ వివాహం ఉషారాణితో శుక్రవారం అనంతపురంలోని నేషనల్ పార్క్‌లోని శిల్పారామం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ హరీష్ యాదవ్, ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

వజ్రకరూరు: ఎంపీడీఓగా ఏవీ శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ చంద్రమౌళి ఉరవకొండ మండలానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో విడపనకల్లు మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఏవీ శ్రీనివాసులుకు అదనంగా వజ్రకరూరు మండలం ఎఫ్ఏసీ ఎంపీడీఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను సర్పంచులు మోనాలిసా, మల్లెల జగదీష్, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన ఎంపీడీఓతోపాటు బదిలీ అయిన ఎంపీడీఓను ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం



'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను చూపుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

కళ్యాణదుర్గం: పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం కుందుర్పి మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ లబ్ధి అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పార్టీకి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కీలకంగా పనిచేయాలన్నారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, సచివాలయ మండల కన్వీనర్ ఈ.రాము, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, కో ఆప్షన్ సభ్యుడు ముజీవుల్లా, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, డీలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'ఉన్నం' కుటుంబం హైడ్రామా

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పక్కా ప్లాన్‌తో హైడ్రామాకు తెరలేపారు. మంత్రి ఉషశ్రీచరణ్ అవినీతి అక్రమాలను ఆధారాలతో బయట పెడతామంటూ మాజీ ఎమ్మెల్యే కుమారుడు మారుతి చౌదరి బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. దీంతో కళ్యాణదుర్గంలో శుక్రవారం ఉదయం కాస్త ఉద్రిక్తత ఏర్పడింది. టీసర్కిల్ ప్రాంతంలో టీడీపీ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఇదంతా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మెప్పుకోసమే ఉన్నం ఫ్యామిలీ డ్రామాకు తెరలేపినట్లు పలువురు విమర్శిస్తున్నారు. ఇటీవల దుర్గంలో టీడీపీ గ్రూపులపై అధినేత సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఉన్నం ఫ్యామిలీకి టికెట్ ఇచ్చేది లేదంటు చంద్రబాబు స్పష్టంగా చెప్పినట్లు సమాచారం . ఈ నేపథ్యంలో మంత్రి ఉషశ్రీచరణ్‌పై బురద జల్లె ప్రయత్నం చేస్తూ.. అధినేత దృష్టిలో పడాలన్నదే వీరి ఎత్తుగడ అని భారీగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం మారుతి చౌదరి అరెస్టు అనంతరం మారుతి భార్య వరలక్ష్మి, తల్లి లక్ష్మీదేవి టీ సర్కిల్‌కు వచ్చి నిరసన చేపట్టడం డ్రామాలో భాగమేనని గుసగుసలు వినిపిస్తున్నాయి. కళ్యాణదుర్గం టీడీపీ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడును అధినేత చంద్రబాబు వద్ద డమ్మీని చేసేందుకు ఉన్నం ఫ్యామిలీ తాపత్రయ పడుతున్నట్లు తెలుస్తోంది.

చట్టాలపై విస్తృత అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న దిశ డీఎస్పీ ఎ.శ్రీనివాసులు

కణేకల్లు: మహిళలు, బాలికలపై జరుగుతున్న అసాంఘిక దురాచారాలను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అనంతపురం దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీ ఎ.శ్రీనివాసులు సూచించారు. స్థానిక బిస్మిల్లా ఫంక్షన్ హాలులో శుక్రవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి సాట్ నాయకుల స్వశక్తీకరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కణేకల్లు, బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హిరేహాళ్, ఉరవకొండ, విడపనకల్లు, కూడేరు, వజ్రకరూర్, గుంతకల్లు మండలాల నుంచి సాట్ (సోషల్ యాక్షన్ టీం) సభ్యులు 250 మంది విచ్చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ఆర్డీటీ సాట్‌ను ఏర్పాటు చేయడం అభినందనయమన్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తే మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు అరికట్టడానికి వీలవుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, సీడీపీఓ యల్లమ్మ, కేజీబీవీ ఎస్ఓ మహాలక్ష్మి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ క్రిష్టారెడ్డి, వైకేపీ ఏరియా కో ఆర్డినేటర్ గంగాధర్, న్యాయవాదులు వసుంధర, వెంకటరెడ్డి, ఏటీఎల్ శ్రీనివాసరెడ్డి, శిక్షకులు రామక్రిష్ణ, బీసీ నరసింహులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



అలంకరణలో సీతారాములు

బొమ్మనహాళ్ **బెళుగుప్ప:** మండలంలోని బూదిగుమ్మ ఆంజనేయ స్వామి, పద్మావతి వెంకటరమణస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం ప్రధాన అర్చకుడు జ్ఞానేశ్వరావు, వేదపండితులు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి నూతన రథానికి తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఎస్ఐ రామకృష్ణయ్య, ప్రజాప్రతినిధులు ఆలయకమిటీ సభ్యులు, భక్తులతో కలసి తొలి పుణ్యావచన పూజలు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానాల కమిటీల చైర్మన్లు తిమ్మారెడ్డి, ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, వైఎస్సార్‌సీపీ నాయకుడు త్రిలోక్‌రెడ్డి, రామసాగరం సర్పంచ్ రామక్రిష్ణమ్మ, ఎంపీటీసీ వీరబొమ్మన్న, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జయచంద్రశర్మ, కేశవరెడ్డి, గోవిందరెడ్డి, రామసాగరం గ్రామ పెద్దలు పాల్గొన్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

మైలార లింగేశ్వరస్వామి రథోత్సవం

కుందుర్పి: మండలంలోని తెనగల్లు గ్రామంలో మైలార లింగేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు తమలపాకులు, అరటిపండ్లు రథంపై విసిరి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం గొరవయ్యలకు పాలుపోయు కార్యక్రమం, రాత్రికి గ్రామోత్సవం ఉంటుందని సర్పంచ్ వరలక్ష్మి తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, వైస్ ఎంపీపీ బీజప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కళ్యాణదుర్గం: రక్తదానం...ప్రాణదానంతో సమానమని శివమాలధారుల గురుస్వామి సోమశేఖర్ అన్నారు. పట్టణంలోని స్థానిక బావి బసవేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 40 మందికి పైగా మాలాధారులు రక్తదానం చేశారు.

శ్రీశైలానికి మాలధారుల పాదయాత్ర

రాయదుర్గంటౌన్: శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి రాయదుర్గం పట్టణం నుంచి శివమాలధారులు కాలినడకన శుక్రవారం బయల్దేరారు. అంతకుముందు స్థానిక టీచర్స్ కాలనీలో శ్రీఓంకారేశ్వర స్వామి ఆలయంలో శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీపీ



హెచ్‌ఎం సర్వమంగళంతో మాట్లాడుతున్న ఎంపీపీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుంకిరెడ్డి

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీపీ కరణం పుష్పావతి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో జరుగుతున్న 'నాడు–నేడు' పనులను పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అంతకు ముందు మధ్యాహ్నం భోజనం నాణ్యతను ఎంపీపీ పరిశీలించారు. భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు. అనంతరం పాల్తూరులో సచివాలయం 1, 2, 3 సచివాలయాలను ఎంపీపీ తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సర్పంచు బీవ్లారాణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుంకిరెడ్డి, సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, నాయకులు షన్ముఖగౌడు, డిష్ వెంకటేశులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం'

రాయదుర్గంటౌన్/ఉరవకొండ: ప్రజా వ్యతిరేక విధానాలతో కేంద్రంలోని బీజేపీ సర్కారు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పాలన చేస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగార్జున ధ్వజమెత్తారు. కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అలాగే ఉరవకొండలోని ఎస్‌బీఐ ప్రధాన శాఖ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి కురుకుంట మనోహర్ మాట్లాడుతూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న ఆదానీ ఆస్తులను కేంద్రం వెంటనే జప్తు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు వీడాలన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట రేపు

కూడేరు: మండలంలోని జయపురంలో ఆదివారం నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు, నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరవుతారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కణేకల్లు: మండలంలోని బ్రహ్మసముద్రంలో శనివారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

వజ్రకరూరు: రోగులకు మెరుగైన వైద్య సేవలందించి ఆస్పత్రికి మంచిపేరు తీసుకురావాలని తహసిల్దార్ అనిల్‌కుమార్ సూచించారు.శుక్రవారం మండలంలోని గడేహోతురు గ్రామంలోని ప్రభుత్వాస్పత్రిలో సర్పంచు కె.సురేంద్ర అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు నిర్వహించారు. ఈసందర్భంగా 2022–23కు సంబంధించి మంజూరైన హెచ్‌డీఎఫ్ నిధులు, వినియోగం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైద్యులు పద్మ, మారుతి, సీనియర్ అసిస్టెంట్ మురళి, సూపర్‌వైజర్ నాగేంద్ర, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఏర్పాటు

బెళుగుప్ప: మండలంలోని గుండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) నూతన కార్యవర్గాన్ని గౌరవ సభ్యుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి అర్జున్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకటప్ప, గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా రుషీంద్రమణి, శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా బి.శ్యామ్‌సుందర్, కోశాధికారిగా తులసీరామ్, కార్యదర్శులుగా మరికొందరు ఎన్నికయ్యారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

కళ్యాణదుర్గం రూరల్: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ బాలాజీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టే పనులు, నిధులకు ప్రతిపాదనలు, అంచనాలు, మిషన్ అంత్యోదయ కార్యక్రమాల నిర్వహణపై ఆయన వివరించారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన బాధ్యతపై కార్యదర్శులపై ఉందన్నారు.

వైద్య సిబ్బంది పనితీరుపై అసంతృప్తి

విడపనకల్లు: వైద్య సిబ్బంది పనితీరుపై ఎంపీపీ కరణం పుష్పావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని పాల్తూరు ప్రభుత్వాస్పత్రిని సర్పంచు బీవ్లారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆమె తనిఖీ చేశారు. 25 మందికి పైగా ఉండాల్సిన సిబ్బంది నలుగురు మాత్రమే ఉండటంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణకుమారి సమయపాలన లేకుండా ఆస్పత్రికి వస్తున్నారని స్థానికులు మెడికల్ ఆఫీసర్‌పై ఫిర్యాదు చేశారు. హాస్పిటల్ సిబ్బంది అంతా మధ్యాహ్నం 12 గంటలకే తాళం వేసి వెళ్తున్నారన్నారు. మెడికల్ ఆఫీసర్ అరుణకుమారి, ఎంపీహెచ్ఓ జాఫర్ పనితీరు బాగాలేదని డీఎంహెచ్ఓకు ఎంపీపీ ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భీంరెడ్డి , హంపయ్య, సింగాడి రాజశేఖర్, షన్ముఖగౌడు, డిష్ వెంకటేశులు, కావలి వెంకటేశులు, బోయ నాగరాజు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక

ఉరవకొండ: కేంద్ర ప్రభుత్వ జాతీయసేవా పథకంలో భాగంగా మార్చి 21 నుంచి 27 వరకూ కర్ణాటక రాష్ట్రంలోని గదగ్‌లో నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఖాదర్‌బాషా, సుచిత్ర ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందంతో కలసి ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు వెంకటరాముడు, అల్తాఫ్, సాంస్కృతిక సంధానకర్త నారాయణస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో శుక్రవారం వీరయ్యచౌదరి మామిడి తోటలో మల్లేశ్వరస్వామి మామిడి రైతుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ అధికారి ధనుంజయ మామిడిలో పూత, పిందె దశలో చేపట్టాల్ని జాగ్రత్తలను వివరించారు. మార్కెటింగ్ సదుపాయం గురించి సీసీడీ ప్రతినిధులు(సెంటర్ ఫర్ కల్టీవేటివ్ డెవలప్‌మెంట్) పలు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో పలు గ్రామాల మామిడి రైతులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి

వజ్రకరూరు: పప్పుశనగ కొనుగోళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పప్పుశనగ కొనుగోలు, రిజిస్ట్రేషన్ నమోదు, ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం గడేహోతూరు, చిన్నహోతూరు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి పప్పుశనగ పంటకు ఈ–క్రాప్ బుకింగ్ చేపట్టిన పొలాలను పరిశీలించారు. అలాగే రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంపీహెచ్ఈఓ ప్రమీల, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇందు, రైతులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ పాక్షికం

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం రూరల్: ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ శుక్రవారం రాయదుర్గం, కళ్యాణదుర్గం పట్టణాల్లో పాక్షికంగా జరిగింది. ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఉదయం నుంచి విద్యార్థి సంఘాల నేతలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను బంద్ చేయిస్తున్న నేపథ్యంలో ఆందోళనను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు.

వ్యక్తికి గాయాలు

బెళుగుప్ప: మండలంలోని హనిమరెడ్డిపల్లి వద్ద శుక్రవారం జాతీయ రహదారి పక్కనే వున్న ఐరన్ విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కుందుర్పి మండలం కదరంపల్లికి చెందిన ప్రతాప్ కారులో స్వగ్రామానికి వెళ్తుండగా రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసం కావడంతో పాటు అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'ఎమ్మెల్సీ' పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల పరిశీలన

రాయదుర్గం/కూడేరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా వాటి ఏర్పాట్లకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. రాయదుర్గం పట్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ మారుతి, ఎన్నికల డీటీ సుజాత, ఏఎస్ఐ వెంకటేశులు, వీఆర్వో హరితో కలసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల పట్ల ఆరా తీశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా పట్టభద్రుల ఓట్లు 4,460, ఉపాధ్యాయుల ఓట్లు 337 ఉన్నాయన్నారు. అలాగే కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా, ఎస్ఐ సత్యనారాయణ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస ప్రసాద్, వీఆర్వో సేతు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.